క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టెన్త్ మోడల్ టెస్ట్



బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జి.మాడుగుల: స్థానిక ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 200 మంది హాజరయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పాంగి కొండబాబు మాట్లాడుతూ మోడల్ టెస్ట్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. టెన్త్ విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా పరీక్షలకు సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు మల్లేష్, నాయకుడు భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా మెహర్‌బాబా 130 జయంతి



మెహర్‌బాబాకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చింతపల్లిరూరల్: స్థానిక మెహర్‌బాబా ఆలయంలో మెహర్‌బాబా 130 జయంతిని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉప్పల బంగారయ్య శెట్టి, తాటిపాకల రమేష్, రాజేశ్వర రావు, స్టాలిన్, ఈశ్వరరావు, వర్తక సంఘం కార్యదర్శి పేదిరెడ్ల భేతాళుడు, పసుపులేటి వినాయకరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉదయ్

ఎటపాక: మండలంలోని గన్నవరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ ఈటె ఉదయ్ 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందికి ఈసీజీ, 70 మందికి రక్తపరీక్షలు చేయడంతోపాటు బీపీ, సుగర్ తదితర రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ కంటె రాజు, కందుకూరి సుధీర్, రంభాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు మందుల సరఫరా

సీలేరు: రోగులకు సకాలంలో మందులు ఇవ్వాలన్న లక్ష్యంతో విడతల వారీగా మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీలకు సరఫరా చేస్తున్నారు. ఆదివారం గూడెం, దారకొండ, సీలేరు పీహెచ్‌సీ లకు జిల్లా డ్రగ్స్ కార్యాలయం నుంచి అత్యవసరమైన మందులు, వ్యాక్సిన్లు సరఫరా చేశారు.

చురుగ్గా రామాలయ నిర్మాణం



నిర్మాణ దశలో రామాలయం

గొలుగొండ: నాగాపురంలో రామాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణం కోసం టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. దీనికితోడు గ్రామస్తులు సైతం సహాయ సహకారాలు అందించడంతో త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు



మారేడుమిల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



రంపచోడవరంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే

మారేడుమిల్లి : ప్రభుత్వానికి వలంటీర్లు మూల స్తంభాల్లాంటి వారని, ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు సత్వరమే నేరుగా ప్రజలకు చేరాలన్న లక్ష్యంతోనే సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని చెప్పారు. టీడీపీ హయాంలో పథకాలు మంజూరుకావాలంటే నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేదని, చివరికి పథకాలు అందుతాయో , లేదో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజల వద్దకే సేవలు చేరుతున్నాయన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించారని చెప్పారు. జి.రాజన్న దొర (జీఎం వలస సచివాలయం), సార్ల రామ్ ప్రసాద్ రెడ్డి (కుట్రవాడ), పల్లాల సుబ్బలక్ష్మి (మారేడుమిల్లి), పల్లాల సోమిరెడ్డి (సున్నంపాడు), కుండ్ల సన్యాసి రెడ్డి (తాడేపల్లి) సేవా రత్న అవార్డులు, 118 మంది సేవా మిత్ర అవార్డులు పొందారు. వారికి ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు సర్టిఫికెట్లు అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), కో-ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, వైస్ ఎంపీపీ తుమ్మ్డుడు లత, సర్పంచ్‌లు కుండ్ల ప్రభాకర్ రెడ్డి, లచ్చిరెడ్డి, లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్, మండల కార్యదర్శి బి.గంగరాజు, వైస్ సర్పంచ్ బి.వీరబాబు, నాయకులు బులసు మిల్లి చంటి, నారాయణరావు, అనుదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగాపనిచేస్తూ వలంటీర్లు విశేష సేవలు అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. మండలంలోని సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు పొందిన వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీడీవో హరికృష్ణలు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు పండగ

- ప్రత్యేక పూజలు చేసిన పలువురు ప్రజాప్రతినిధులు



గిరిజనులతో కుంభా రవిబాబు, సుభద్ర, భాగ్యలక్ష్మి

ముంచంగిపుట్టు: మండలంలోని లబ్బూరు గ్రామంలో పోతురాజు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పండగలో పాల్గొన్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం తదితరులు గిరిజన సంప్రదాయం ప్రకారం ముందుగా చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఆలయంలో పోతురాజును దర్శించుకున్నారు. ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్సీ, జెడ్పీచైర్‌పర్సన్,ఎమ్మెల్యే తదితరులకు గిరిజనులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో కొంతసేపు మమేకమయ్యారు. పండగ సందర్భంగా పోతురాజు ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యమ్మ, సర్పంచ్‌లు నీలకంఠం, రమేష్, ఎంపీటీసీలు కమల, సుబ్బలక్ష్మి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ జగబంధు, నాయకులు జయదేవ్, దామోదరం, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో అష్టలక్ష్మి విగ్రహాలు



నూకాంబిక ఆలయంలో అష్టలక్ష్మల విగ్రహాలు

కశింకోట : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రాంగణంలో అష్టలక్ష్మి విగ్రహాలను నూతనంగా నెలకొల్పారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. లక్ష్మీదేవి అష్ట అవతారాలతో ఉన్న ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితర విగ్రహాలను వరుసగా నెలకొల్పి అందంగా రంగులు వేశారు. ఇవి చూడముచ్చటగా ఉన్నాయి. . ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు.

గిరిజనులకు రాచబాట



అసనగిరి గ్రామానికి కాలినడకన వెళ్తున్న అనకాపల్లి కలెక్టరు రవి పట్టన్ శెట్టి (ఫైల్)

- కలెక్టరు చొరవతో రహదారి సమస్య పరిష్కారం
- రూ.25 లక్షలతో కొండల్లోంచి పూర్తయిన గ్రావెల్ రోడ్డు
- రూ.28 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు
- సుందరకోట గ్రామ పంచాయతీ ప్రజల ఆనందం



సుందరకోట నుంచి అసనగిరి మధ్య రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు



సుందరకోటలో నిర్మాణ దశలో పాఠశాల భవనం

నాతవరం: కలెక్టరు చొరవతో గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తీరాయి. రూ.25 లక్షలతో కొండలోంచి కొత్త రోడ్డు వేయడంతో స్వగ్రామంలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా పొందుతున్నారు. దశాబ్దాలుగా తాము పడిన కష్టాలకు వైఎస్సార్‌సీపీ పాలనలో మోక్షం కలగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుందరకోట పంచాయతీ పూర్తిగా దట్టమైన కొండల నడుమ ఉంది. మొదట్లో సరుగుడు పంచాయతీ పరిధిలో శివారు గ్రామంగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేజరు పంచాయతీలు విభజన చేయడంతో సుందరకోట నూతన పంచాయతీగా ఏర్పడింది. ఈ పంచాయతీలో అసనగిరి, శిరిపురం, తోరడ, కొత్త దద్దుగుల, ముంతమామిడిలొద్దు, బమ్మిడికలొద్దు, కొత్త లంకలు శివారు గ్రామాలుగా ఉన్నాయి. ఆయా గ్రామాలన్నీ నాతవరం మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో కొండల మీద ఉన్నాయి. సుందరకోట గ్రామం వరకే రోడ్డు సదుపాయం ఉంది. మిగతా శివారు గ్రామాలకు లేక కొండల మీద నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో సుందరకోట గ్రామాన్ని గతేడాది కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ నుంచి మూడున్నర కిలోమీటర్ల మేర అసనగిరి గ్రామానికి కాలినడకన వెళ్లారు. కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఉండటంతో చలించిపోయారు. గ్రామస్తుల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. గిరిజనుల కోరిక మేరకు రోడ్డు ఏర్పాటు చేస్తానని, తాగునీటి సమస్యతోపాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.2.5 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి టెండర్ల ఖరారు

కలెక్టరు ఇచ్చిన మాట ప్రకారం సుందరకోట నుంచి అసనగిరికి రూ.25 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయించారు. దీన్ని తారురోడ్డుగా మార్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ ప్రాజెక్టు వర్క్స్ ద్వారా రూ.2.5 కోట్లు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే కొత్త లంకలు, కొత్త దద్దుగులు, అసనగిరి, సుందరకోట గ్రామాలకు వాహనాలపై రాకపోకలు సాగించవచ్చు.

అసనగిరిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.28 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల టెండర్లు పూర్తి చేశారు. ఈ వేసవిలో పనులు ప్రారంభిస్తారు. అసనగిరిలో అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం మంజూరు చేశారు. అర్హత కలిగిన వారికి పింఛన్లు, రైతు భరోసా సాయం, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, అటవీ హక్కు పత్రాలు మంజూరు చేశారు. ఆయా పథకాలు అందించేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విశేష కృషి చేశారు. సుందరకోట పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తయి రంగులు వేస్తున్నారు. సంక్షేమ పథకాలు అందించేందుకు సిగ్నల్స్ సమస్య ఉండటంతో కొత్త టవరు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు ఇటీవల స్థలాన్ని పరిశీలించారు

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



కశింకోటలో నూకాంబిక అమ్మవారు

కశింకోట : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వారపు పొద్దు కావడంతో భక్తులు ఎక్కువ మంది దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, తల నీలాలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. కొందరు తమ ఇళ్ల వద్ద రాత్రి అంతా నూకాంబిక జాగరణ నిర్వహించి, బంధువులు, కుటుంబ సభ్యులతో ఊరేగింపుగా అరటి గెలలు, బోనాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో అన్న సమారాధనలు జరిపారు.

స్వయంభూ వరాహలక్ష్మీ నృసింహస్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న రమణమ్మ

చీడికాడ: అర్జునగిరిలో వెలసిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీ నృసింహస్వామి వారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ఆదివారం మధ్యాహ్నం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అన్నసమారాధనకు తమ వంతు సహకారంగా సర్పంచ్ బి.రమాదేవి, పెద్దలకు రూ.5 వేలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో అడవిరాజుల బాబు పండగ



రాజవొమ్మంగి శివారు పొలాల్లో చెట్టుకింద నిర్వహించిన పూజలు

రాజవొమ్మంగి : మండలవ్యాప్తంగా అడవి రాజుల బాబు(బాలరాజులబాబు) పండగను ఆదివారం గిరిజనులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఏటా శివరాత్రి ముందు నుంచి ఈ పండగను పొలాలు, అడవుల్లో జరుపుకోవడం ఆనవాయితీ. ఇంటిల్లిపాది తమ తోటల్లోకి వెళ్లి అక్కడ ఓ చెట్టు కింద రాజులబాబుకు పూజలు చేస్తారు. తొలుత అక్కడ ముగ్గులు వేసి, పూలు చెట్టు కొమ్మలతో అలంకరిస్తారు. వెదురు బోగుల్లో తాటికల్లు నింపి నైవేద్యంగా సమర్పిస్తారు. కొత్తబియ్యంతో పెసర పప్పు, బెల్లం కలిపి వండిన చక్రపొంగలి, అరటిపళ్లు కొబ్బరికాయలు సమర్పిస్తారు. పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు దేవునికి సమర్పిస్తారు. అక్కడే వంటలు చేసుకుని తోటి రైతులు, స్నేహితులు, బంధువులతో కలసి సహ పంక్తి భోజనాలు చేస్తారు. రాజుల బాబుల పండగ సందర్భంగా పల గ్రామాల్లో సందడి నెలకొంది.

28న శివాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన



బుట్టాయిగూడెంలో నూతనంగా నిర్మించిన శివాలయం

ఎటపాక: బుట్టాయిగూడెంలోని నూతనంగా నిర్మించిన శివాలయంలో ఈనెల 28న విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఇక్కడ గల పురాతన శివాలయం జీర్ణావస్థకు చేరడంతో భద్రాచలం,కూనవరం ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మించిన త్రయంబకేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం విగ్రహాలను పునఃప్రతిష్ఠించనున్నారు. ఉదయం 7గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. గణపతి, త్రయంబకేశ్వర(శివపార్వతుల), ఆయ్యప్పస్వామి,నాగబంధాల విగ్రహాల పునః ప్రతిష్ఠ పూజాకార్యక్రమాలు వైభవోపేతంగా జరుపనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది.

నేడు వైఎస్సార్ వాహన యాత్ర

అడ్డతీగల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వైఎస్సార్ వాహన యాత్ర నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దాల వీర్రాజు తెలిపారు. ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరగనున్న ఈ యాత్ర ఉదయం 10.30 గంటలకు అడ్డతీగలలో ప్రారంభమవుతుందన్నారు. 12 గంటలకు గొండోలు, 2 గంటలకు కోనలోవ, 3.30 గంటలకు గొంటువానిపాలెం, సాయంత్రం 5 గంటలకు తిమ్మాపురంలో జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, గత నాలుగున్నర సంవత్సరాలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు,పార్టీ అనుబంధ విభాగాల కమిటీల సభ్యులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వీర్రాజు కోరారు.

నేడు జగ్గవరం సచివాలయంలోకి ఎంపీడీవో కార్యాలయం మార్పు



మండలపరిషత్ కార్యాలయం ఏర్పాటుకానున్న భవనం

కూనవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయాన్ని సోమవారం కోతులగుట్టలో ఉన్న జగ్గవరం గ్రామ సచివాలయం భవనంలోకి మారుస్తున్నట్టు ఎంపీడీవో ఈ ప్రేమ్‌సాగర్ ఆదివారం తెలిపారు. 1987లో మండల కేంద్రంలోని టేకులబోరు గ్రామంలో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయం భవనం తరచూ వస్తున్న గోదావరి వరదలకు దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. భవనం ప్రమాదభరితంగా ఉండడంతో గత కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ కార్యాలయాన్ని జగ్గవరం **గ్రామ సచివాలయం**లో మార్చాలని రెండు నెలల **కిందట ఆదేశాలు** జారీచేసినట్టు ఎంపీడీవో తెలిపారు. దీంతో సచివాలయంలోకి ఎంపీడీవో కార్యాలయాన్ని మారుస్తున్నట్టు ఆయన చెప్పారు.

రూ.48 లక్షలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణం

- అవసరమైతే మరిన్ని నిధులు
- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



నిధులు మంజూరు పత్రాన్ని సంఘ ప్రతినిధులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.48 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఆలయ పున ర్నిర్మాణ విషయాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టగా, శనివారం రూ.48 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. త్వరితగతిన పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మాట ఇచ్చానంటే తప్పనిసరిగా చేస్తానన్నారు. ఒకే ఒకసారి తన దృష్టికి తీసుకొచ్చారని, అందరిలా మాటలు చెప్పే వ్యక్తిని కాదని, పని చేసి చూపించడమే తననైజం అన్నారు. నిధులు సరిపోకపోతే మరిన్నీ తీసుకువస్తానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అనంతరం నిధులు మంజూరు పత్రాన్ని సంఘ ప్రతినిధులు పెదపాటి గోవిందరావు, నాగేశ్వరరావులకు అందజేశారు. కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయానికి ఎమ్మెల్యే గణేష్ చొరవతో పూర్వ వైభవం రానుందని సంఘ ప్రతినిధి గోవిందరావు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నూకాలమ్మ దేవాలయం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం



మోదకొండమ్మ పాదాలను దర్శించుకుంటున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: ఒమ్మలి చెరకు తూనిక కేంద్రం వద్ద వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా మహిళల కోలాటాల ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్‌తోపాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు స్థానిక మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. ఇక్కడ తెల్లవారు నుంచి ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తాగునీరు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: గ్రామ దేవతల ఒడ్డు పండగలు ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

కె.జె.పురంలో మోదకొండమ్మ, నూకాంబిక అమ్మవార్ల ఒడ్డు పండగల సందర్భంగా భక్తులు ఘటా లతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మోదకొండమ్మ, సాగరం, సురవరం, గ్రామాల భక్తులు ఘటాలు ఊరేగించారు.